# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :12 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 27-02-2024 | పేజీలు:4 వెల: 2.00


## పవన్ సీటు చంద్రబాబు డిసైడ్ చేయాలి

అమరావతి,టీడీపీ – జనసేన కూటమి కి సంబందించిన ఫస్ట్ లిస్ట్ విడుదలైన సంగతి తెలిసిందే. టిడిపి 94 స్థానాల్లో , జనసేన 24 స్థానాల్లో పోటీ చేయబోతున్నట్లు తెలిపారు. ఇక జనసేన ప్రస్తుతానికి ఐదు సీట్లకు సంబందించిన అభ్యర్థులను ప్రకటించారు. అయితే పవన్ కళ్యాణ్ పేరు లేకపోవడం అందర్నీ నిరాశకు గురి చేసింది. దీనిపై వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. తన సీటును తాను ప్రకటించుకోలేని దౌర్భాగ్య స్థితిలో పవన్ కళ్యాణ్ ఉన్నారని మంత్రి రోజా ఎద్దేవా చేశారు. 'బాలకృష్ణ, లోకేశ్ పేర్లను ప్రకటించారు. కానీ పవన్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది చంద్రబాబు డిసైడ్ చేయాలి. బాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి మేనిఫెస్టోను అమలు చేయలేదు. పవన్ పార్టీ ఎందుకు పెట్టారో తెలీదు. తాను అధికారంలోకి వస్తే ఏం చేస్తానో చెప్పలేదు' అని రోజా ఇచ్చారు. పవన్ కళ్యాణ్ నైజం ఇప్పుడు కాపులకు అర్థమైందని.. ఇన్నాళ్లు మమ్మల్ని విమర్శించిన వాళ్లు ఇప్పుడు తల ఎక్కడ పెట్టుకుంటారంటూ మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. చంద్రబాబు కోసమే పవన్ కళ్యాణ్ రాజకీయం చేస్తాడని, 24 సీట్లతో పవన్ కళ్యాణ్ కాపులకు రాజ్యాధికారం


## బలమైన అభ్యర్థి కోసం అన్వేషణ...



పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి వేటలో పడింది పార్టీ హైకమాండ్. ఇక్కడ బలమైన అభ్యర్థిని బరిలో దింపేందుకు దృష్టి సారించింది. ఇద్దరు, ముగ్గురు నేతలు టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. అయితే మాదిగ సామాజికవర్గ నేతకు టికెట్ఇవ్వడానికి అధిష్టానం మొగ్గు చూపుతుందట. పెద్దపల్లి పార్లమెంట్ స్థానం లో ఎన్నికల హడావిడి మొదలైంది. ఈ సారి తెలంగాణలో అధిక స్థానాలు గెలిచేందుకు ప్రత్యేక వ్యూహ రచన చేస్తోంది. ఈ నేపథ్యంలోనే పెద్దపల్లి లోక్ సభ నియోజకవర్గంలో మాత్రం గట్టి నేత లేకపోవడంతో ఏమి చేయాలో నేతలు ఆలోచిస్తున్నారట. ఇప్పటివరకు ఉన్న వివేక్ కాంగ్రెస్ పార్టీలో చేయడంతో బలమైన నేత కరువయ్యాడు. ఇక్కడి నుంచి వివేక్ బరిలో ఉండే అవకాశం ఉండటం తో.. ఇతర నేతలపై దృష్టి పెట్టలేదట పార్టీ అధిష్టానం. అయితే.. అసెంబ్లీ ఎన్నికల ముందు.. వివేక్ బీజేపీ వీడి.. కాంగ్రెస్ లో చేరారు. దీంతో ఒక్కసారి రాజకీయ పరిణామాలు మారిపోయాయి. గత ఎన్నికల్లో పోటీ చేసిన కుమార్ మరోసారి టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. అదేవిధంగా.. మాజీ ఎమ్మెల్యే కాసిపేట్ లింగయ్య టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారట. ముఖ్యంగా పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలో మాదిగ సామాజిక వర్గంతోపాటు మాదిగ ఉప కులాలు ఓట్లు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. మాదిగ సామాజిక వర్గం నేతలపై దృష్టి పెట్టారు. బీఆర్ఎస్ పార్టీలో బలమైన నేతలతో పాటుచ కాంగ్రెస్ లో ఉన్న బలమైన నేతలు చేర్పించుకునేందుకు దృష్టి పెడుతున్నారు. ఇప్పటికి ఇద్దరు, ముగ్గురు నేతలు బీజేపీ టచ్‌లోకి వెళ్లారట. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో బీజేపీకి ఓటింగ్ శాతం పెరిగింది. దీంతో మోదీ హవా, రామ మందిర్ నిర్మాణం అంశాలు విజయానికి దోహద పడుతాయని భావిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో సింగరేణి ఓట్లు కూడా కీలకం. ఈ ఓట్లను రాబట్టుకోవడానికి ప్లాన్ చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో బలమైన నేతలు ఉన్నారు. ఈ రెండు పార్టీలో పోటీ తీవ్రంగా ఉంది. అయితే, ఈ రెండు పార్టీలో టికెట్ రాని నేతలు బీజేపీలో చేరే అవకాశం ఉంది. బీజేపీ మొదటి జాబితాలో పెద్దపల్లి పేరు ఉండదని నేతలు చెబుతున్నారు. ఎలాగైనా ఈసారి పెద్దపల్లిలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు ప్రత్యేక ఫోకస్ పెట్టారు పార్టీ అగ్రనేతలు. మొత్తానికి పెద్దపల్లిలో బీజేపీ వర్గ విభేదాలు కూడా తలనొప్పిగా మారిపోయాయి. బీజేపీ జిల్లా అధ్యక్షులు ఎన్నిక నేపథ్యంలో రచ్చ రాజుకుంది. ఇక్కడ అభ్యర్థి ఎంపిక విషయంలో అధిష్టానం తలనొప్పిగా మారింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా నేతలు సహకరించుకోలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, ఇక్కడ పెరిగిన ఓటు బ్యాంక్ కారణంగా గట్టి పోటీ ఇవ్వడానికి బీజేపీ కసరత్తు మొదలు పెట్టింది.

## నిజాంసాగర్ ఆధునీకరణ.. మరో రూ.127 కోట్లు కేటాయింపు


హైదరాబాద్,సాగునీటి రంగంలో పెండింగ్ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. వేలకోట్ల అంచనా వ్యయాలు పెరిగినప్పటికీ ఆధునీకరణకు నోచుకోని ప్రాజెక్టులను పునరుద్ధరించి వేలాది ఎకరాల భూములకు సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తుంది. ఎప్పటికప్పుడు నిపుణులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటుంది. ఈనేపథ్యంలో తెలంగాణలో నిజాంరాజులు తొలిసారిగా రూపొందించిన నిజాంసాగర్ ప్రాజెక్టు పై రేవంత్ రెడ్డి సర్కార్‌దృష్టి సారించింది. ప్రాజెక్టు కాలువలను ఆధునీకరించడం తో పాటుగా పూడికలు తీసి నీటినిల్వ సామర్థ్యం పెంచేందుకు చర్యలు చేపట్టింది. ప్రాజెక్టు నిర్మించి శతాబ్దకాలమైనా ఆధునీకరణ పనులు పూర్తి కాకపోవడంతో నిర్దేశిత లక్ష్యానికి నిజాంసాగర్ దూరంగానే ఉంది. మంజీర నదిపై 1923లో నిర్మాణం ప్రారంభించి 1931లో పూర్తి చేసిన ఈ ప్రాజెక్టు లక్ష్యం 29.72 ఎకరాలు కాగా ఇప్పటికీ 17.91 టీఎంసీ కే పరిమితమైంది. ఆధునీకరణ పేరుతో ప్రణాళికలు రూపకల్పన చేసిన అంచనా నిధుల పేరుతో జీఓ లు విడుదలైనా ఆధునీకరణ పనులు అరకొరగానే జరగడంతో ఇప్పటికీ పూర్తి స్థాయి లక్ష్యం చేరుకోలేక పోయింది. అయితే తొలిసారిగా 1972లో ప్రాజెక్టును ఆధునీకరించే ప్రయత్నం జరిగింది. 1200 నుంచి 1400 ఎఫ్ ఆర్ ఎల్ పెంచారు. అయితే ఆతర్వాత 1992-93వరకు ప్రాజెక్టు ఇన్‌ఫ్లో స్థిరంగానే ఉంది, అనంతరం పాలకవర్గాలు ప్రణాళికలకే పరిమితం కాగా పూడిక పెరిగి 8 టీఎంసీలకు చేరుకుంది, ఈ నేపథ్యంలో 2005-2006లో పూడికతీత కొంత మేరకు తీసి నీటిసామర్థ్యం పెంచగలిగారు. ఆతర్వాత ప్రాజెక్టు ఆధునీకరణకు ప్రణాళికలు, నిధుల మంజూరు జరిగిందే కానీ ముందుకు కదలలేదు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడగానే నిజాంసాగర్ ఆధునీకరణ పేరుతో రూ.742కోట్ల పరిపాలనా పరమైన అనుమతులు ఇచ్చి కాలువల ఆధునీకరణ ప్రారంభించినప్పటికీ సంవత్సరానికి అంచనావ్యయం పెరుగుతోందే కానీ పనులు పూర్తి కాకపోవడంతో ఆయకట్టు స్థిరీకరణ అనేక సవాళ్లనుఎదుర్కొంటు ంది. అనంతరం



అనేక పర్యాయాలు అంచనా బడ్జెట్ ను సవరించడంతోనే సరిపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిజాంసాగర్ ఆధునీకరణపై దృష్టి సారించింది. పనుల్లో వేగం పెంచేందుకు ఇటీవల అధికారులు నిజాంసాగర్ ప్రాజెక్టును క్షేత్ర స్థాయిలో పరిశీలించి మరో రూ. 127 కోట్లు అవసరమవుతాయనే అంచనాను రూపొందించారు. ప్రధానంగా ఈ ప్రాజెక్టు పరిధిలో విస్తరించి ఉన్న 155 కిలోమీటర్ల ప్రధానకాలువ, 283ఉపకాలువలు, 82 పంపిణీ కాలువలను ఆధునీకరించడంతో నిజాంసాగర్ పూడిక తీయాల్సిన అవశ్యకత ఏర్పడిందని అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. 1972లో ఈ ప్రాజెక్టుకు హైడ్రాజికల్ సర్వే అనంతరం ఇప్పటివరకు సర్వే జరగలేదు. ఈ నేపథ్యంలో త్వరలో హైడ్రాజికల్ సర్వే జరగనున్నట్లు తెలుస్తోంది. నిజాం కాలంలో మంజీర నదిపై తొలిసారిగా నిర్మించిన నిజాం సాగర్ నిజాంల పాలనలో నిర్మించిన తొలి ప్రాజెక్టుగా చరిత్రలో నిలిచిపోయినప్ప టికీ ప్రాజెక్టును పదిలపర్చుకునే ప్రయత్నాలు వేగవంతంగా జరగపోవడంతో ఇప్పటికీ ఆధినీకరణ ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి సర్కార్ ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించింది. పెండింగ్ పనులను పూర్తి చేసి అదనంగా 19వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అదనంగా బాన్సువాడ,బోధన్ నియోజకవర్గాల్లో కాలువల ఆధునీకరణ చేయనున్నట్లు సమాచారం.

## తేడా వస్తే అభ్యర్థులను మార్చేస్తా..

అమరావతి,ఎన్నికల యుద్ధానికి సిద్ధమైన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆ పార్టీ అభ్యర్థులకు వార్నింగ్ ఇచ్చారు. తొలి జాబితా విడుదల చేసిన ఒక రోజులోనే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను హెచ్చరించారు. పనితీరు బాగుంటేనే అభ్యర్థులు పోటీకి దిగుతారని తెలిపారు. పని తీరు సరిగాలేని అభ్యర్థులను మార్చడానికి వెనుకాడనని స్పష్టం చేశారు. శనివారం 94 మంది ఎమ్మెల్యే అభ్యర్థులతో టీడీపీ అధినేత చంద్రబాబు తొలి జాబితా విడుదల చేశారు. వారితో ఆదివారం వీడియో కాన్ఫెరన్స్ నిర్వహించారు. వారం వారం అభ్యర్థుల పనితీరును పర్యవేక్షిస్తానని తెలిపారు. పోలింగ్ వరకు సర్వే చేయిస్తానని వెల్లడించారు. అభ్యర్థులపై వ్యతిరేకత ఉంటే వారిని మార్చేస్తానని హెచ్చరించారు. సీటు వచ్చేసిందని నిర్లక్ష్యంగా ఉంటే మరొకరికి ఛాన్స్ ఇస్తానని అభ్యర్థులకు వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికలకు సమయం దగ్గర పడిందని చంద్రబాబు అన్నారు. రానున్న 40 రోజులు చాలా ముఖ్యమని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల జరుగుతున్న నష్టాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వైసీపీ ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉందో ప్రజలకు చెప్పాలని స్పష్టంచేశారు. జనసేన నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ఎన్నికల ప్రచారం పాల్గొనాలని టీడీపీ అభ్యర్థులకు నిర్దేశించారు. 5 కోట్ల మంది ఏపీ ప్రజల భవిష్యత్తు కోసం టీడీపీ-జనసేన పొత్తు పెట్టుకున్నాయని వివరించారు. ఏపీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని టీడీపీ అభ్యర్థులను ఎంపిక చేశానన్నారు. విజయమే లక్ష్యంగాటీడీపీ అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుకు ప్రజల మద్దతు కూడా కావాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అందుకే కొత్త పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేశానని తెలిపారు. అసంతృప్తితో ఉన్న నాయకులను అవసరమైతే పదిసార్లైనా వెళ్లి కలవాలని అభ్యర్థులకు సూచించారు. తానే అభ్యర్థిననే గర్వంతో ఉండటం తగదన్నారు. ఏపీకి జరిగిన నష్టాన్ని తటస్థ ఓటర్లకు వివరించాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికపై ఎంతో



కసరత్తు చేశామని చంద్రబాబు వెల్లడించారు. 1.3 కోట్ల మంది ఓటర్ల నుంచి అభిప్రాయ సేకరణ చేశామన్నారు. సర్వేల తర్వాత అభ్యర్థుల ఎంపిక చేశానని తెలిపారు. 2024 అసెంబ్లీ ఎన్నికలు ఏపీ భవిష్యత్తుకు ఎంతో కీలమని చంద్రబాబు అన్నారు. ఒక్క సీటులోనూ పరాజయం చవిచూడకూడ దన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ అహంకారంతో చేసిన విధ్వంసం వైసీపీ ప్రభుత్వ పతనానికి నాంది పలకబోతోందని విమర్శించారు. అధికార పార్టీని ఓడించడానికి జనం సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఓటర్లతో ఓట్లు వేయించుకోవాల్సింది అభ్యర్థులదేనని స్పష్టంచేశారు. సీఎం వైఎస్ జగన్ సిద్ధం పేరుతో సభలు పెడుతున్నారు కానీ.. ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదని విమర్శించారు. జగన్ ఎన్నికల్లో విజయం కోసం తన పాలనపై విశ్వాసం పెట్టుకోలేదని.. దొంగ ఓట్లు, డబ్బును, అక్రమ మార్గాలను నమ్ముకున్నారని చంద్రబాబు ఆరోపించారు. జగన్ కుట్రలు, కుతంత్రాలు ఊహించని విధంగా చేస్తారని విమర్శించారు. ఎలక్షన్స్ వరకు రోజూవారీ చేయాల్సిన కార్యక్రమాలపై అభ్యర్థులతో చంద్రబాబు చర్చించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో భారీ గోల్‌మాల్



హైదరాబాద్,తెలంగాణా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో భారీ గోల్‌మాల్ జరిగింది. ఈ కేసులో తీగ లాగితే డొంక కదిలింది. నమ్మలేని నిజాలు బయటకు వస్తున్నాయి. ఈ స్కాంలో పెద్ద పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఆసుపత్రి సిబ్బందితో పాటు, ప్రజాప్రతినిధుల పీఏల పాత్ర ఉన్నట్లు ఉంది. కేవలం పీఏలే ఉన్నారా లేక ఎమ్మెల్యేల పాత్ర కూడా ఉందా అనే కోణంలో విచారిస్తున్నారు. 200 కోట్ల రూపాయలు గోల్ మాల్ అయినట్టు అంచనా. తెలంగాణలో మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. సీఎం రిలీఫ్ ఫండ్ పేరుతో పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడినట్లుగా విచారణలో తేలింది. మిర్యాలగూడలో బయడపడ్డ కేసులో తీగ లాగిన అధికారులకు, నమ్మలేని నిజాలు తెలిశాయి. సీఎం రిలీఫ్ ఫండ్ నగదు కోసం నకిలీ పేషెంట్లను రూపొందించడమే కాకుండా తప్పుడు బిల్లులు పెట్టుకొని పెద్ద మొత్తంలో నగదు స్వాహా చేసినట్లు తేలింది. నకిలీ బిల్లులు సృష్టించిన కొద్దీ డబ్బులు స్వాహా ఉన్నాయి. రాష్ట్రంలోని రెండు ఆస్పత్రుల్లో బాధితులకు వైద్య చికిత్స అందించకుండానే.. చేయించినట్లు నకిలీ బిల్లులు సృష్టించారు. వైద్యం చేయకపోయినా.. నకిలీ బిల్లులు సృష్టించిన ఖమ్మంలోని వినాయక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు.. మిర్యాలగూడలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌పై కేసు నమోదు చేశారు. నల్గొండకు చెందిన జ్యోతి, లక్ష్మి, దిరావత్, శివపై కేసు నమోదు చేశారు పోలీసులు. నిరుపేదలకు ఉచితంగా వైద్య చికిత్స అందించడం కోసం ఆరోగ్య పథకాలతో పాటు.. ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తున్నాయి. వాటిలో ఒక సీఎం రిలీఫ్ ఫండ్.. నిరుపేదలకు ఉచిత వైద్య చికిత్సను ఆరోగ్య శ్రీ ద్వారా అందించారు. అయితే కొన్ని వ్యాధులకు అధికంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అవి ఆరోగ్య శ్రీ పరిధిలోకి రావు.. అటువంటి వారికి ఉపయోగపడే మరొక పథకం.. సీఎం రిలీఫ్ ఫండ్.. 2018లోనే రాష్ట్ర అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యేల సన్నిహిత అనుచరులకు నియోజకవర్గానికి 20 మంది చొప్పున ఎలాంటి మెడికల్ బిల్లులు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల చెక్కులను అందించారు. . దీనితో ఈ వ్యవహారంలో రూ.200 కోట్లు దుర్వినియోగం అయినట్టు అంచనా వేస్తున్నారు. అసలు దీని వెనక ఎవరున్నారు?

ఏ విధంగా ముఖ్యమంత్రి సహాయనిధిని దుర్విని యోగం చేశారు? ఎవరితో ఈ తతంగం నడిపించాలనే దానిపై ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అంతర్గతంగా విచారిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ పెద్ద సంఖ్యలోనే ఉన్నది. అయితే అర్హులైన పేదలు రూ.లక్షల్లో పెట్టుకున్న బిల్లులకు రూ.50 వేల లోపే చెక్కుల రూపంలో అందగా.. ఎలాంటి బిల్లులు లేకుండా రూ.లక్షల్లో ఎమ్మెల్యేలకు దగ్గరగా ఉన్నోళ్లకు స్థలాలు. సాధారణంగా ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలు స్తోమతకు మించి ప్రయివేటు హాస్పిటళ్లలో ఖర్చు పెట్టి చికిత్స చేయించుకుంటే.. అందుకు సంబంధించిన పూర్తి బిల్లులను ప్రభుత్వా నికి సమర్పించాల్సి ఉంటుంది. ముందుగా బాధితులు ఎమ్మెల్యేకు దరఖాస్తు చేసుకుంటే వారు సీఎంవోకు పంపుతారు. అక్కడ సీఎంఆర్ఎఫ్ సెక్షన్‌లో కమిటీ పరిశీలించి ఆర్థిక సాయం అందిస్తుంది. ఆ తరువాత మూడు లేదా నాలుగు నెలలకు చెక్కలను ఎమ్మెల్యేల చేతుల మీదుగా బాధితులకు అందజేస్తారు. అయితే 2018లో మూడు వేలకు పైగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల్లో లక్షలాది రూపాయలు అధికార పార్టీ ఎమ్మెల్యేల దగ్గరకు వెళ్లాయి. వారు ప్రత్యేకంగా సూచించిన పేర్లకే రూ.10 రూ.15 లక్షల వరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందినట్లు తెలిసిం ది. వడ్డించే వాడు మనవాడైతే.... అవినీతికి పాల్పడేందుకు వాళ్లకు అడ్డదార్లు ఎన్నో వుంటాయి. సి.ఎం. రిలీఫ్ ఫండ్ నుంచి కూడా నొక్కె వచ్చని అప్పట్టి పాలకులు నిరూపించారు. అలా అప్పనంగా డబ్బులు నొక్కేసేందుకు నకిలీ రోగులను సృష్టించడమే కాకుండా.. తప్పుడు బిల్లులు పెట్టి కుంభకోణానికి తెరతీశారు.

## తెలంగాణ కాంగ్రెస్‌కు వారసత్వ గండం



హైదరాబాద్, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి కాస్త ఊపు ఉందని గట్టిగా నమ్ముతున్నారు. తమ వారసులను రాజకీయాల్లోకి తీసుకొచ్చి స్థిరపడేలా చేయడానికి ఇంత కంటే మంచి సమయం ఉంటుందని అనుకుంటున్నారు. సీనియర్ నేతలంతా.. లోక్ సభ ఎన్నికల్లో తమ వారసులకు లేకపోతే కుటుంబసభ్యులకు టిక్కెట్లు అందుబాటులో హైకమాండ్ పై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి మంచి అవకాశాలు ఉంటాయన్న అభిప్రాయంతో చాలా నియోజకవర్గాల్లో పోటీ కూడా ఎక్కువగానే ఉన్నది. నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి కె. జానారెడ్డి తమ వారసుని కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఓ కుమారుడు నాగార్జున సాగర్ నుంచి గెలిచాడు. మరో కుమారుడ్నిఎంపీ చేయాలనుకుంటున్నారు. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గం నుంచి వారసుల పోటు ఎక్కువైంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భార్య నందిని మల్లు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తమ్ముడు ప్రసాదరెడ్డి కృషి చేశారు. మెదక్ నియోజకవర్గం నుంచి తనకు ఎంపీ టికెట్ ఇవ్వాలంటూ మైనంపల్లి హన్మంతరావు అడుగుతున్నారు. జహీరాబాద్ టికెట్‌ను తన కూతురు త్రిషలకు ఇప్పించేందుకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రయత్నించారు. తన భార్య నిర్మల కోసం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రయత్నించారు. పెద్దపల్లి పార్లమెంటు నుంచి తన కుమారుడు గడ్డం వంశీకి టికెట్టు ఇప్పించేందుకు చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి ప్రయత్నిస్తున్నారు. భువనగిరి నుంచి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భార్య కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో వారసులకు టికెట్లు అన్న చర్చపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి వారసుల పార్టీ అనే ముద్ర ఉంది. దీన్ని చెరుపుకుని కొత్త నాయకత్వాన్ని పెంచుకుంటేనే.. భవిష్యత్ లో .. నాయకత్వానికి ధోకా లేకుండా ఉంటుందని.. హైకమాండ్ ఆ దిశగా ఆలోచించాలని క్యాడర్ సూచిస్తున్నారు.

### టీఎస్పీఎస్సీ గ్రూప్ 1 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్,తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) గ్రూప్ 1 రిక్రూట్‌మెంట్ 2024 దరఖాస్తు ప్రక్రియను ప్రారంభమైంది. తెలంగాణ పీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష 2024 మే, జూన్‌లో జరిగే అవకాశం ఉంది. టీఎస్పీఎస్సీ ప్రిలిమినరీ ఎగ్జామ్ 2024 కోసం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ రిక్రూట్‌మెంట్ పరీక్ష కోసం దరఖాస్తు ప్రక్రియను కమిషన్ ప్రారంభించింది. డిప్యూటీ కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారితో సహా మొత్తం 563 ఖాళీల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ దరఖాస్తులకు అభ్యర్థులందరూ అప్లికేషన్ ఫీజు రూ.200 చెల్లించాలి. పరీక్ష ఫీజు కాకుండా రూ.120 చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగ దరఖాస్తుదారులందరికీ పరీక్ష ఫీజు మినహాయింపు ఉంటుంది. 26 ఏప్రిల్ 2022 తేదీ నోటిఫికేషన్ నంబర్ 04/2022 కోసం గతంలో దరఖాస్తు చేసిన, ఫీజు చెల్లించిన

## విచారణకు రాలేను .. సీ బి ఐ కి ఎమ్మెల్సీ కవిత లేఖ

హైదరాబాద్ : సీబీఐ విచారణకు ఎమ్మెల్సీ కవిత రేపు. హాజరుకావడంలేదు. సీబీఐ విచారణకు ఎందుకు రావడం లేదోనని సుదీర్ఘ లేఖ రాసింది కవిత. కాగా.. లిక్కర్ స్కాం కేసులో రేపు తమ ముందు హాజరు కావాలని కవితకు సీబీఐ 41ఏ నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సీబీఐకి లేఖ రాసింది. లేఖలో కీలక అంశాలను ప్రస్తావించింది ఎమ్మెల్సీ కవిత. సీఆర్పీసీ సెక్షన్ 41ఏ కింద జారీ చేసిన నోటీసులను రద్దు చేయండి లేదా ఉపసంహరించుకోండని తెలిపారు. ఒకవేళ తన నుంచి సీబీఐకి ఏవైనా ప్రశ్నలకు సమాధానం, సమాచారం కావాలనుకుంటే వర్చువల్ పద్ధతిలో హాజరవ్వడానికి అందుబాటులో ఉంటానని తెలిపారు. ముందే నిర్ణయించిన కార్యక్రమాలు ఉన్న రీత్యా.. ఈ నెల 26న విచారణకు హాజరుకావడం సాధ్యం కాదని పేర్కొన్నారు. సీఆర్పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇవ్వడం సబబు కాదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 2022 డిసెంబరులో అప్పటి ఐవో ఇదే తరహా నోటీసును సెక్షన్ 160 కింద ఇచ్చారు.. గతంలో జారీ చేసిన సెక్షన్ 160 నోటీసుకు ప్రస్తుత సెక్షన్ 41ఏ నోటీసు పూర్తి విరుద్ధంగా ఉందని లేఖలో పేర్కొన్నారు. సెక్షన్ 41ఏ కింద ఎందుకు, ఏ పరిస్థితుల్లో నోటీసులు ఇచ్చారో



స్పష్టత లేదని అన్నారు. నోటీసు జారీ చేసిన సందర్భం కూడా ఆలోచింపజేస్తున్నదని తెలిపారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నోటీసులు జారీ చేయడం అనేక ప్రశ్నలకు తావునిస్తోంది.. తనకు ఎన్నికల ప్రచార బాధ్యతలు ఉన్నందున ఢిల్లీకి పిలవడం అనేది ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా అవరోధం కలిగిస్తుందని అన్నారు. ఇది తన ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులకు భంగం కలిగిస్తుందని ప్రస్తావించారు.

## సంపాదకీయం

మంగళవారం 27-02-2024

# కాంగ్రెస్ ఢిల్లీ గులామిని వదులుకోవాలి !

తెలంగాణలో కాంగ్రెస్ విజయం అన్నది కేవలం కెసిఆర్ వ్యతిరేకతతోనే అని కాంగ్రెస్ నేతలు ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. అలాగే ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ది పనులను పరుగులు పెట్టించాలి. నిర్ణయాలు త్వరితంగా తీసుకుంటూనే.. వాటి అమలును కూడా వేగవంతం చేసుకోవాలి. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలను అతిగా ఇక్కడ జోక్యం చేసుకోకుండా చూసుకోవాలి. గత వాసనలు వదిలించుకుంటే తప్ప ఇక్కడి రేవంత్ ప్రభుత్వం నిలదొక్కుకోలేదు. ఇక్కడి నిరుద్యోగ యువత, కళాకారులు, మేధావులు, జర్నలిస్టులు, సబ్బండ వర్గాలు తెలంగాణ ఏర్పాటుకు పోరాడారు. ఎందరో ఆత్మార్పణం చేశారు.. వారి పోరాటంతో తెలంగాణ సాకారమయ్యింది. అయితే అది తన ప్రతిభ వల్లనే అని, తను మృత్యుముఖంలోకి వెళ్లి వచ్చానని ప్రకటించుకోవడంతో పాటు, పదేళ్ల పాటు కెసిఆర్ నిరంకుశంగా పాలించారు. విర్రవీగిన పాపానికి మూల్యం చెల్లించారు. దాని ఫలితమే కరిమింగిన వెలగపండులాగా ఇప్పుడు అప్పుల కుప్పలు బయటపడ్డాయి. నాయకుల అవినీతి బయటపడుతోంది. ఈ విషయాలను గుర్తించి ఇచ్చిన హావిూల అమలు కోసం చేసే కార్యక్రమంలో కాంగ్రెస్ పెద్దలను పదేపదే పాల్గొనేలా చేయడం వల్ల ప్రజల్లో విమర్శలపాలు కాకతప్పదు. కేవలం ఇక్కడి ప్రజలే తమ హీరోలుగా కార్యక్రమాలతో ముందుకు సాగాల్సి ఉంది. అదే రేవంత్ ప్రభుత్వానికి శ్రీరామరక్ష కానుంది. మల్లికార్జున ఖర్గే మొదలు, రాహుల్, సోనియా, ప్రియాంకలను పార్టీపరంగా ఢిల్లీకి వెళ్లి కలవడం వేరు..అదే పనిగా వారే ఇక్కడి కార్యక్రమాలను నిర్దేశించేలా చేసుకోవడం వల్ల ముప్పు ఉంటుందని గుర్తించాలి. గతంలో ప్రతిపనికి ఢిల్లీకి వెళ్లిన కారణంగానే కాంగ్రెస్ భ్రష్టుపట్టి, ప్రాభవం కోల్పోయింది. గతానుభవాలను బట్టి నడుచుకోవాల్సి ఉంది. అందుకే తెలంగాణ పాలనలో వారికి దూరంగా నిర్ణయాలు జరగాలి. వారి ప్రమేయం పెరిగితే మొదటికే మోసం జరగగలదు. ఇప్పటికే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఢిల్లీ నుంచి పాలన అన్న విమర్శలు వస్తున్నాయి. రేషన్ సిలిండర్, గృహజ్యోతి పథకాలను కూడా ఇక్కడి సామాన్యులతో ప్రారంభించి ఉంటే మరింతగా రేవంత్ ప్రతిభ పెరిగేది. ఎందుకంటే ఇండియా కూటమిలో లుకలుకలు ఇక్కడ ప్రభావం పడకుండా చూసుకోవాలి. అవకాశం వస్తే మింగేద్దామన్న రీతిలో బిజెపి, బిఆర్ఎస్ కాచుకుని ఉన్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికలలో తాము 400కి పైగా సీట్లు గెలుచుకుని తీరతామని బీజేపీ ప్రకటిస్తోంది. వారసత్వ రాజకీయాలను గట్టిగా వ్యతిరేకిస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఖర్గే ఉన్నా పెత్తనం సోనియా, రాహుల్‌దేనని తెలిసిందే. ఇప్పటికే కూటమి నుంచి నితీశ్ వైదొలిగారు. నీరసపడిన కాంగ్రెస్ ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. యూపీలోని అమేథీని ఇప్పటికే కోల్పోగా, రాయబరేలిలో కూడా విజయం కష్టమే. కాంగ్రెస్ ముక్త రాజకీయాలను మోదీ బలంగా తీసుకుని వెళుతున్నారు. కాంగ్రెస్ రాబోయే సార్వత్రిక ఎన్నికలలో కనీసం 50కి పైగా సీట్లనైనా కైవసం చేసుకోగలదా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికలను తీసుకుంటే.. కేవలం 44 సీట్లు మాత్రమే కాంగ్రెస్‌కు దక్కాయి. కాంగ్రెస్ స్వతంత్ర భారత సార్వత్రిక ఎన్నికల్లో ఇంత తక్కువ సీట్లను మాత్రమే గెలుచుకోవడం అదే మొదటిసారి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కూడాకాంగ్రెస్ పరిస్థితి మెరుగు పడలేదు. 2014లో కంటే కేవలం 8 సీట్లు మాత్రమే అదనంగా గెలుచుకోగలిగింది.. కేరళ, తమిళనాడులో అధికార పార్టీలతో పొత్తు పెట్టుకుని పోటీ చేయడం వల్లే 2019లో 52 సీట్లను కాంగ్రెస్ గెలుచుకోగలిగింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో సైతం కేరళ, బహుశా తెలంగాణ మినహా మరే రాష్ట్రంలోనైనా కాంగ్రెస్ గెలుచుకోగల సీట్ల సంఖ్య రెండంకెలలో ఉండటమనేది కష్టమని ఒపీనియన్ పోల్స్ దాదాపుగా అన్నీ ఘోషిస్తున్నాయి. 2014లోనూ, 2019లోనూ కేంద్రంలో బీజేపీ అధికారానికి రావడానికి కాంగ్రెస్ స్వయంకృత రాజకీయాలే కారణం. ఈ నిజాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు త్వరగా గుర్తించాలి. ఇక్కడ కాంగ్రెస్ ముసుగు ఉన్నా ప్రజలు మాత్రం కేవలం కెసిఆర్, బిజెపి వ్యతిరేకతతో గెలిపించారని తెలుసుకోవాలి. అలా తెలుసుకుని తమ రాజకీయాలన్నీ ఉద్యమ పోరాటాలు చుట్టూ సాగించాలి. అప్పుడే తెలంగాణలో మెరుగైన ఫలితాలు వస్తాయి. ఎందుకంటే ఇప్పటికే బిజెపి బిఆర్ఎస్ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేసింది. బిఆర్ఎస్ ఒక్కసీటు గెల్చినా దేశానికి లాభం లేదని వాదిస్తోంది. బిఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీలో వేసినట్లేనని వాదిస్తోంది. కవితకు సిబిఐ సమన్లు పంపడం ద్వారా బిఆర్ఎస్‌తో ఎలాంటి పొత్తు లేదని చెబుతోంది. కర్నాటక పరిస్థితులు వేరు. తెలంగాణ ప్రజలు వేరు. తెలంగాణలో ప్రజలు సెంటిమెంట్‌కు విలువనిస్తారు. అది చేజారకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిఎం రేవంత్ రెడ్డికి, ఆయనతో పాటు అధికారం పంచుకున్న బృందానికి ఉంది. ఉద్యమకారులు, అమరుల కుటుంబాలు, పోరాటయోధులను అలంబనగా చేసుకుని వారి కార్యక్రమాలు సాగాలి. మేధావుల సూచనలు,సలహాలు తీసుకోవాలి. గృహజ్యోతి, సిలిండర్ పథకాలకు కూడా వీరినే హీరోలుగా తీసుకుని అమలు చేయాలి. అంతేగాని ప్రియాంక రాకవల్ల మైలేజీ వస్తుందని అనుకుంటే పొరపాటే. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని సత్వరంగా పరిష్కరించే క్రమంలో సొంతంగా నిర్ణయాలు ఉండాలి. అదేవిధంగా ఢిల్లీ యాత్రలను మానుకోవాలి. అవసరమైతే లోపాయకారిగా హాట్‌లైన్‌లో మాట్లాడుకోవాలి. అప్పుడే రేవంత్‌పై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. కెసిఆర్ చేసిన తప్పులను చేయకుండా ముందుకు సాగాలి. అన్ని వర్గాలకు తాము అండగా ఉన్నామని చెప్పడం వేరు..ఆచరించి చూపడం వేరు. రైతుబంధు, కాళేశ్వరం,గొర్రెల పథకంలో దుబారాను, అవినీతిని బయటపెట్టి నిలదీయగలిగితే ప్రజలు హర్షిస్తారు. అదేపనిగా విమర్శలతో కాలం గడిపితే కూడా ప్రజలు ఆదరించరు.

# విజయనగరం..ఎవరికి వరం




**విజయనగరం :** విజయనగరం జిల్లాలోని మరో అసెంబ్లీ నియోజకవర్గం విజయనగరం. విజయనగరం హెడ్ క్వార్టర్(నగర) పరిధి మొత్తం ఈ నియోజకవర్గంలో భాగంగా ఉంది. ఇప్పటి వరకు ఇక్కడ 18 సార్లు ఎన్నికలు జరిగాయి. అత్యధిక సార్లు ఇక్కడ తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. ఈ నియోజకవర్గం నుంచి ఎక్కువసార్లు టీడీపికి చెందిన అశోక్ గజపతిరాజు విజయం సాధించి రికార్డు సృష్టించారు. నియోజకవర్గ పరిధిలో 2,12,092 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,05,161 మంది పురుష ఓటర్లు ఉండగా, 1,06,928 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. తొలి ఎన్నిక 1952లో జరిగిందిఇప్పటి వరకు 18 సార్లు ఈ నియోజకవర్గంలో ఎన్నికలు జరిగాయి. తొలి ఎన్నిక 1952లో జరిగింది. ఈ ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ నుంచి పోటీ చేసిన జి సూర్యనారాయణ తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సి సూర్యనారాయణపై 41,056 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ నుంచి పోటీ చేసిన పీవీ రాజు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన జి అప్పలస్వామిపై 36,463 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1953లో సభకు ఉపఎన్నిక జరగ్గా పీఎస్పీ నుంచి పోటీ చేసిన పీవీజీ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1955లో జరిగిన ఎన్నికల్లో పీఎస్పీ నుంచి పోటీ చేసిన పీవీజీ రాజు మరోసారి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బీవీ సంజీవరావుపై 24,128 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1957లో జరిగిన ఉప ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ నుంచి పోటీ చేసిన బాట్టం శ్రీరామమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బాట్టం శ్రీరామమూర్తి తన సమీప ప్రత్యర్థి బీజేఎస్ నుంచి పోటీ చేసిన వి రామారావుపై 30,649 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1967లో జరిగిన ఎన్నికల్లో బీజేఎస్ నుంచి పోటీ చేసిన వి రామారావు కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బాట్టం శ్రీరామమూర్తిపై 18,359 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అప్పసాని అప్పన్నదొర ఇక్కడి నుంచి విజయం సాధించారు. బీజేఎస్ నుంచి పోటీ చేసిన పి అనవిళ్లపై 23,916 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1978లో జరిగిన ఎన్నికల్లో జనతా పార్టీ నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు ఇక్కడ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అప్పసాని అప్పన్నదొరపై 26,085 ఓట్ల తేడాతో విజయాన్ని నమోదు చేశారు. 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు మరోసారి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన పీఆర్ కృష్ణపై 40,392 ఓట్లతో గెలుపొందారు. 1985లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ అశోక్ గజపతిరాజు టీడీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఎంఎస్ రావుపై 37,969 ఓట్ల తేడాతో అశోక్ గెలుపొందారు. 1989లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి మరోసారి బరిలోకి దిగిన అశోక్ గజపతిరాజు కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామిపై 9747 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసిన అశోక్ గజపతిరాజు ఐదోసారి విజయాన్ని దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మరోసారి బరిలోకి దిగిన కోలగట్ల వీరభద్రస్వామిపై 21,031 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన పూసపాటి అశోక్ గజపతిరాజు ఆరోసారి వరుసగా విజయాన్ని దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామిపై వరుసగా మూడోసారి 9131 ఓట్ల తేడదాతో విజయం సాధించారు.2004లో జరిగిన ఎన్నికల్లో తొలిసారి అశోక్ గజతిపరాజు ఓటమి చవి చూశారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామి చేతిలో 1126 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 2009లో జరిగిన ఎన్నికల్లో మరోసారి టీడీపీ నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వీరభద్రస్వామిపై 3282 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసిన మీసాల గీత ఇక్కడ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి వైసీపీ నుంచి పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామిపై 15,404 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి టీడీపీ నుంచి పోటీ చేసిన అతిథి గజపతిరాజుపై 6417 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. విజయనగరం అసెంబ్లీ స్థానం విజయనగరం రాజుల అడ్డాగా నిలుస్తూ తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారింది. ఇప్పటి వరకు అశోక్ గజపతిరాజు ఇక్కడి నుంచి ఏడుసార్లు విజయాన్ని దక్కించుకున్నారు. ఒకేఒక్కసారి ఆమె ఓటమి పాలయ్యారు. గడిచిన ఎన్నికల్లో తన కుమార్తెను ఈ స్థానం నుంచి బరిలోకి దింపారు. ఆమె కూడా పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే ఓటమి పాలయ్యారు. రానున్న ఎన్నికల్లో ఇక్కడి నుంచి మరోసారి అశోక్ బరిలో దిగేందుకు సిద్ధపడుతున్నారు. వైసీపీ నుంచి కోలగట్ల వీరభద్రస్వామి పోటీ చేయనున్నారు. వచ్చే ఎన్నిక మరింత ఆసక్తిరకంగా ఉండనుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# మళ్లీ ఢిల్లీ లిక్కర్ స్కామ్ హాట్ టాపిక్కేనా..?




హైదరాబాద్, : ఢిల్లీ లిక్కర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను సీబీఐ ఇందులో నిందితురాలిగా పరిగణించింది. ఈ మేరకు కవితకు సీబీఐ నోటీసులు కూడా ఇచ్చింది. ఈ కేసులో ఫిబ్రవరి 26న విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొంది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో పాటు కవితను కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉందని సీబీఐ వర్గాలు చెబుతున్నాయి. ఈ కేసులో ఇప్పటికే కల్వకుంట్ల కవితను సీబీఐ మూడుసార్లు ప్రశ్నించిన సంగతి తెలిసిందే. 2022లో ఇదే కేసులో సీబీఐ ప్రశ్నించింది. లిక్కర్ కేసులో నిందితురాలిగా సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను సవరిస్తూ తాజాగా మరోసారి సీబీఐ నోటీసులు ఇచ్చింది. అప్పుడు చేసిన దర్యాప్తు తర్వాత కవితను నిందితురాలిగా సీబీఐ పరిగణించింది.లిక్కర్ కేసులో సీబీఐ హైదరాబాద్‌లోని కవిత నివాసంలో ఆమెను విచారణ చేసి.. ఆమె స్టేట్‌మెంట్ తీసుకున్న సంగతి తెలిసిందే. ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా కొన్నిసార్లు కవితను ఢిల్లీలోని తమ కార్యాలయానికి ఆహ్వానించి ప్రశ్నించింది. ఆఖరుసారి గత ఏడాది జనవరి 16న విచారణకు రావాల్సిందిగా కవితకు ఈడీ నోటీసులు ఇచ్చింది. ఈ నెల 26న తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ ఢిల్లీ సీబీఐ విభాగం ఆమెకు నోటీసులు ఇచ్చింది. మద్యం అమ్మకాలకు సంబంధించి అక్కడి ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీలో అనేక అక్రమాలు జరిగాయని, అమ్మకందారులకు లబ్ధి చేకూర్చేలా దీన్ని రూపొందించారన్న ఆరోపణలపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఇందులో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారినట్లు సీబీఐ ఆరోపణ. నిధుల మళ్లింపునకు సంబంధించి ఈడీ కూడా మరో కేసు నమోదు చేసింది. గత ఏడాది ఫిబ్రవరి 26న అప్పటి ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి సిసోదియాను అరెస్టు చేశారు. మద్యం అమ్మకాల్లో కీలకంగా మారిన సౌత్ కార్టల్ తరఫున కవిత కీలకంగా వ్యవహరించారని, మద్యం వ్యాపారులతో కలిసి పలుమార్లు సమావేశాలు నిర్వహించారని, ఇదే పనిమీద పలుమార్లు ఢిల్లీ కూడా వచ్చారన్నది సీబీఐ, ఈడీల వాదన.మహిళల్ని ఇంటి వద్దనే విచారించాలని కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఆ పిటిషన్ ఈడీ కేసునకు సంబంధించింది. ఇప్పుడు సీబీఐ నోటీసులు జారీ చేసింది. ఈ నెలాఖరులో విచారణ జరగనున్న సమయంలో సీబీఐ నోటీసులు కలకలం రేపుతున్నాయి. ఈ కేసులో ఆమె ఛార్టర్డ్ ఎకౌంటెంట్ బుచ్చిబాబు, ఆమె తరఫున ప్రతినిధులుగా వ్యవహరించినట్లు కేసులో పేర్కొన్న మద్యం వ్యాపారి, వైసీపీ నాయకుడు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు మాగుంట రాఘవరెడ్డి, అరుణ్‌రామచంద్ర పిళ్లై, శరత్‌చంద్రారెడ్డి, అభిషేక్ బోయినపల్లిని కూడా ఈడీ అరెస్టు చేసింది. వీరిలో మాగుంట రాఘవరెడ్డి, శరత్‌చంద్రారెడ్డిలు అప్రూవర్‌లుగా మారి బెయిల్ సంపాయించారు. తన భార్యకు ఆరోగ్యం బాగాలేదని రామచంద్ర పిళ్లై అభ్యర్థన మేరకు న్యాయస్థానం అతనికి మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మిగతావారు ఇంకా జైల్లోనే ఉన్నారు.దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు హైదరాబాద్ వచ్చి కవితను ఆమె ఇంట్లో ప్రశ్నించారు. ఈడీ అధికారులు మాత్రం రెండుసార్లు ఢిల్లీ పిలిపించి విచారించారు. తర్వాత సుప్రీంకోర్టులో విచారణకు హాజరు కాకుండా ఆదే?శాలు తెచ్చుకున్నారు కవిత. సీబీఐ నోటీసులు జారీ చేసింది కాబట్టి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చుట్టూ సీబీఐ ఉచ్చు బిగిస్తున్నట్టేనా.. అంటే.. ఈ కేసు బయటకు వచ్చినప్పటి నుండి జరుగుతున్న పరిణామాలను చూస్తే.. కవిత సేఫ్ అన్న అభిప్రాయం ఎక్కువ మందికి వస్తుంది. పార్లమెంటు ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ కి బీజేపీ కి మధ్య ఎటువంటి లాలూచీ కుస్తీ లేదని నిరూపించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకించి బీజేపీ అగ్రనాయకత్వం తంటాలు పడుతున్న నేపథ్యంలో ఢిల్లీ మద్యం కేసులో ఫిబ్రవరి 26న విచారణకు రావాలంటూ సీబీఐ తాజాగా నోటీసులు జారీ చేసిందని ఎక్కువ మంది నమ్ముతున్నారు. ఎందుకంటే..సీబీఐ కవితను ప్రశ్నించి నెలలు గడిచిపోతోంది. గతంలో హైదరాబాద్ వచ్చి రెండు సార్లు కవితను ప్రశ్నించింది సీబీఐ. రెండో సారి ప్రశ్నించినప్పుడు మరోసారి పిలుస్తామని చెప్పి నోటీసులు ఇచ్చారు. మళ్లీ ఇప్పటి వరకూ సీబీఐ నుంచి పిలుపు రాలేదు. మధ్యలో కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో బాగా లబ్దిపొందారని .. ఆస్తులు సంపాదించారని.. కొన్ని వివరాలతో చార్జిషీట్ వేశారు. మళ్లీ పట్టించుకోలేదు. ఇప్పుడు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈడీ కేసులు వేరు.. సీబీఐ కేసులు వేరు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఈడీ వేరుగా విచారణ జరుపుతోంది. ఆ విచారణను తనను పిలవొద్దని సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ వేశారు. నెలల తరబడి వాయిదాల మీద వాయిదాలు పడుతూనే ఉంది. కవిత రిలాక్స్ అవుతూనే ఉన్నారు. ఇప్పుడు సీబీఐ నోటీసులు ఇచ్చింది. సౌత్ లాబీ నుంచి దాదాపుగా అందరూ అప్రూవర్లు అయ్యారు కవిత తప్ప. అలా అప్రూవర్ అయిన మాగుంట రాఘవరెడ్డి ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా కవితకు నోటీసులు ఇచ్చారని అంటున్నారు. అయితే కవితకు నోటీసులు వెనుక అసలు టార్గెట్ కేజ్రీవాల్ అని ఢిల్లీ రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. చెబుతున్నాయి. సీబీఐ కేసు నమోదు చేసింది? మనీ లాండరింగ్ మీద..డబ్బు లావాదేవీల మీద కాదు. స్కామ్ పాలసీలో మార్పు.. క్విడ్ ప్రో కో వంటి అంశాల మీద. మనీ లాండరింగ్ మీద..డబ్బు లావాదేవీల మీద ఈడీ కేసులు నమోదు చేసింది. పాలసీ మార్పు విషయంలో మాగుంట రాఘవరెడ్డి కీలక విషయాలు వెల్లడించారు. కేజ్రీవాల్ కు, ఆమ్ ఆద్మీ పార్టీకి డబ్బు అందేలా చేశామని ఆయన అంటున్నారు. సౌత్ లాబీకి సంబంధించినంత వరకు ఈ వ్యవహారంలో కవిత పాత్ర కీలకం కాబట్టి ఆమెను విచారణకు పిలుస్తున్నారు. కానీ కవితను గట్టిగా ఫ్రేమ్ చేసే అవకాశాలు లేవని.. కేజ్రీవాల్ ను మాత్రమే టార్గెట్ చేస్తారని అంటున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో గతంలో కేజ్రీవాల్ ను సీబీఐ విచారించింది. ఈడీ విచారణకు మాత్రం కేజ్రీవాల్ హాజరు కావడం లేదు. కవిత విచారణ తర్వాత కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.కవిత విచారణకు హాజరవడం కష్టమేనని న్యాయపరమైన అవకాశాల్ని వెదుక్కుంటారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తన పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ ఉన్నందున హాజరుకాబోనని సమాధానం ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ విషయంలో సీబీఐ స్పందన తీవ్రంగా ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలనుకోవడం లేదు. అయితే కేంద్ర దర్యాప్తు సంస్థ .. ఎలా స్పందిస్తుందో అంచనా వేయడం కష్టం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. ఇటీవల కూడా.. తెలంగాణకు వస్తున్న బీజేపీ నేతలు.. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎవర్నీ వదిలేది లేదని.. తప్పు చేసిన వారిని జైలుకు పంపుతామని అంటున్నారు. అందుకే.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో తదుపరి పరిణామాలు అంచనా వేయడం కష్టమేనని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

# పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచని పటాన్ చెరు

సంగారెడ్డి, పాలకుల చిత్తశుద్ధి లోపంతోనే ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతం పఠాన్ చెరు ఏలాంటి అభివృద్ధి చెందలేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘుందన్ రావు విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఈదుల నాగులపల్లిలో రైల్వే టెర్మినల్ భూసేకరణ వద్దే ఆగిపోవటం విచారకరమన్నారు. 153 కిలోమీటర్ల రింగ్ రోడ్డు నిర్మాణం సాధ్యమైనా కొల్లూరు వద్ద కిలోమీటర్ సర్వీస్ రోడ్డును ఇవ్వలేకపోవటం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి రియల్ ఎస్టేట్ మీద ఉన్న ప్రేమ సర్వీస్ రోడ్డు నిర్మాణం పై లేదని మండిపడ్డారు. పటాన్ చెరులో గొప్ప లాండ్ బ్యాంకు ఉన్నా ఐటి సెజ్ అభివృద్ధి చేయలేదన్నారు. లక్డారంలో క్రషర్ల రూపంలో గుట్టలను, కొండలను కరిగించేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకే ప్రజలు పట్టం కడతారని రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# టీడీపీ ఉక్కిరి బిక్కిరి

చిత్తూరు : కుప్పం..కుప్పం సీఎం జగన్ నోటిలోనూ ఇన్ చార్జి మంత్రి పెద్దిరెడ్డి రాజకీయ చర్యల్లోనూ కుప్పం నియోజకవర్గ రాజకీయంపై ప్రత్యేక దృష్టి సారిస్తే.. మరో వైపు 40 ఏళ్లుగా కుప్పం చక్రవర్తిగా చెలామణి అవుతున్న చంద్రబాబు సైతం అంతర్గత మధనంలో తర్జనభర్జన పడుతున్నారంటే%ౖ% అతిశయోక్తి కాదు. ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రత్యర్థి పార్టీలు వైసీపీ, టీడీపీలో కుప్పం నియోజకవర్గమే మార్మోగిపోతోంది. నియోజకవర్గంలో చంద్రబాబు గెలుపు ఓటములపైనే అందరి దృష్టి కేంద్రీకృతం కావటమే కాదు%ౖ% బెట్టింగ్ బుకీలకు పెద్ద ఆయుధమే దొరికింది. కోట్లకు కోట్ల బెట్టింగులు తెరమీదకు వస్తున్నాయి. ఎక్కడ నలుగురు గుమి కూడినా కుప్పంలో రాజకీయ పరిస్థితులపైనే వాడి వేడిగా చర్చ జరుగుతోంది. కుప్పం ప్రజలు ఎప్పటిలాగే రానున్న ఎన్నికల్లో కూడా చంద్రబాబును ఆదరిస్తారా అనే అంశంపైనే చర్చ తారా స్థాయికి చేరింది. ఈ విషయంపై చిత్తూరు జిల్లాలోనే కాదు అటు తెలంగాణ%ౖ% ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. కుప్పంలో పరిస్థితులు చంద్రబాబుకు ప్రతికూలంగా కనిపిస్తున్నాయని, అభివృద్ధి సంక్షేమంతో ఈసారి తామే గెలుస్తామని అధికార పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తుంటే.. ఎలాంటి ప్రచారం లేకుండా ఈసారి లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తామని టీడీపీ నాయకులు తొడలు చరచటం ఆసక్తికరంగా మారింది.

**కుప్పంలో గతమెంతో**

కుప్పంలో రాజకీయ పరిస్థితులు గతం కన్నా.. భిన్నంగా మారుతున్నాయని దాని ఫలితంగా రానున్న ఎన్నికల్లో చంద్రబాబు అంచనాలు తారుమారు కావచ్చనే అభిప్రాయం రాజకీయ పరిశీలకుల్లో వ్యక్తమవుతోంది. కుప్పం నియోజకవర్గంలో నిన్న మొన్నటి వరకు కంటిన్యూ అవుతున్న సుమారు 20 వేలకు పైగా పక్క రాష్ట్రానికి చెందిన దొంగోట్లను గుర్తించి వాటిని అధికార పార్టీ తొలగించడం ఒక ఎత్తయితే, ఒకప్పుడు 60 వేల పైచిలుకు చంద్రబాబు మెజారిటీ గత ఎన్నికల్లో 30 వేలకు పడిపోవడం చూస్తుంటే పరిస్థితులు పూర్తిగా మారాయని రాజకీయ విశ్లేషకులు అనుమానిస్తున్నారు. అంతేకాకుండా కుప్పంలో తమకు ప్రతికూల పవనాలు వీస్తున్నాయనే విషయాన్ని పసిగట్టిన చంద్రబాబు రానున్న ఎన్నికల్లో కుప్పంనే నమ్ముకుంటే నట్టేట మునిగిపోతామనే ఆలోచనతో ప్రత్యామ్నాయంగా భీమిలిలో కూడా పోటీ చేయాలనే యోచనలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. చంద్రబాబు తీసుకొనే ప్రత్యామ్నాయ నిర్ణయాన్ని కుప్పం ప్రజలు ఆమోదిస్తారా.. మౌనంగా తిరుగుబాటు తీర్పిస్తారా.. అనే విషయాలపై కూడా తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది.

**రెండు సీట్లపైనే అనుమానాలు**

ప్రత్యామ్నాయంగా మరో సీటులో పోటీ చేస్తే కుప్పం ప్రజల్లో అనుమానం ఏర్పడి ప్రతికూలంగా తీర్పుచ్చే అవకాశాలు మెండుగా ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అంతేకాకుండా ఇంతకాలం పాటు గెలిపిస్తూ వచ్చిన మమ్మల్ని అనుమానిస్తావా అనే భావన కుప్పం ఓటర్లలో కలిగితే ఆ తర్వాత చంద్రబాబు పరిస్థితి ఏందనే వాదన కూడా రాజకీయ విశ్లేషకుల్లో వినిపిస్తోంది.ఇక వైసీపీ చిత్తూరు జిల్లాపార్టీ అధ్యక్షుడు, కుప్పం నియోజకవర్గ ఇన్చార్జి ఎమ్మెల్సీ భరత్ ను రానున్న ఎన్నికల్లో మీరు ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపితే తాను అతడిని మంత్రిగా చేసి మీకు గిఫ్ట్ ఇస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇదివరకే పలుమార్లు కుప్పం ప్రజలకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాకుండా జిల్లాకు చెందిన మంత్రి పెద్దిరెడ్డిని వీలైనంతవరకు ఎక్కువ సమయం కుప్పం పైనే దృష్టి సాధించే విధంగా జగన్మోహన్ రెడ్డి పావులు కలుపుతున్నారు. వీటి పర్యవసానంగా రెండేళ్ల కిందట జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను అధికార పార్టీ కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. వీటి ఫలితంగా కుప్పం నియోజకవర్గంలో అధికార పార్టీ ఊహించని విధంగా బలపడుతూ వస్తోందని చెప్పడానికి పలు ఆధారాలు కనిపిస్తున్నాయి. వీటిని అంచనా వేసుకున్న చంద్రబాబుకునేడు సందిగ్ధ పరిస్థితులు తప్పడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**20 వేలకు పైగా దొంగ ఓట్లు రద్దు ..**

కుప్పం నియోజకవర్గంలో ఇప్పటికే రెండు పర్యాయాలుగా దొంగ ఓట్లను తొలగించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు 12 వేలకు పైగా దొంగ ఓట్లను అధికార యంత్రాంగం తొలగించిన విషయం తెలిసిందే. అయితే ఇవన్నీ పక్కనున్న తమిళనాడు కు చెందిన దొంగ ఓట్లుగా అధికారులు గుర్తించి వాటిని తొలగించారు. తాజాగా గత నెలలో 8,778 ఓట్లను జిల్లా అధికారులు తొలగించారు. మొత్తం కలిపి 20,778 దొంగ ఓట్లను గుర్తించి రద్దు చేశారు. ప్రస్తుతం దొంగ ఓట్లుగా గుర్తించి రద్దు చేసిన ఓట్లన్నీ గతంలో చంద్రబాబుకు పోలవుతోందిన ఓట్లని వైసీపీ నాయకుల ఆరోపణ.

**.స్థానిక సంస్థల్లో వైసీపీకి తిరుగులేని బలం**

కుప్పం నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా వైసీపీ బలపడిందని గత ఎన్నికల్లో పోలైన ఓట్ల గణాంకాలే చెబుతున్నాయి. గతంలో కుప్పంలో ఏ ఎన్నిక జరిగినా తెలుగుదేశం అభ్యర్థులే గెలిచారు. అయితే ఆ చరిత్రను తిరగరాస్తు రెండేళ్ల కిందట జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను వైసీపీ గెలుచుకొని కుప్పంలో టీడీపీని చావు దెబ్బ కొట్టింది. 89 గ్రామపంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో 74 స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. అదేవిధంగా 82 ఎంపీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 76 స్థానాలను వైసీపీ గెలుచుకుంది. స్థానిక సంస్థల్లో కీలక పాత్రను పోషించే మండల పరిషత్తు అధ్యక్షులు, జిల్లా పరిషత్తు సభ్యుల ఎన్నికల్లో కూడా నాలుగు ఎంపీపీ స్థానాలు, నాలుగు జడ్పిటిసి స్థానాలను వైసిపి గెలుచుకొని టీడీపీని మట్టి కరిపించింది. . అదేవిధంగా వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుప్పం నియోజకవర్గంలో కొత్తగా మున్సిపాలిటీ ఏర్పాటు చేసి అందులో నిర్వహించిన ఎన్నికల్లో 25 కౌన్సిలర్ స్థానాలకు గాను 19 కౌన్సిలర్లను వైసీపీ గెలుచుకొని విజయదుందుభి మోగించడంతో కుప్పం నియోజకవర్గంలో వైసీపీ అనుకోనంత బలపడింది. ఈ నేపథ్యంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక సంస్థల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులంతా తమ పార్టీ అభ్యర్థి కోసం పనిచేస్తే తప్పక విజయం సాధిస్తామని ధీమాతో పార్టీ అధిష్టానం అంచనాలు వేస్తోంది. ఐతే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎప్పుడూ అధికార పార్టీకే బలం చేకూరుతుంది,

# టీడీపీలో మూకుమ్మడి రాజీనామాలు...


అమరావతి,ఇది ఆరంభం మాత్రమే? చాలా మంది ముందే ఊహించిందే తాజాగా జరగడం మొదలైంది! టీడీపీ – జనసేనలకు మధ్య సీట్ల సర్దుబాటులో భాగంగా సరికొత్త సమస్యలు తెరపైకి వస్తాయని.. టీడీపీ కీలక స్థానాల్లో జనసేన నేతలు సీట్లు ఎగరేసుకుపోతే మొదటికే మోసం వస్తుందని కథనాలు వచ్చాయి. అయితే... జనసేన నుంచి వచ్చే సమస్యల సంగతి కాసేపు పక్కనపెడితే... టీడీపీలోనే అంతర్గత సమస్యలు ఒక్కసారిగా తెరపైకి వచ్చాయి.. తొలి జాబితా అనంతరం వరుస రాజీనామాలు వార్తల్లోకి వస్తున్నాయి. తొలివిడత జాబితా విడుదలై 24 గంటలు గడవక ముందే టీడీపీలో అగ్గి రాజుకుంటుంది. కొన్ని కీలక నియోజకవర్గాల్లో పార్టీ జెండాలు తగలబెట్టే పరిస్థితి నెలకొనగా.. కొన్ని నియోజకవర్గాల్లో కీలక నేతలు రాజీనామా లేఖలు రెడీ చేసుకుంటున్నారని తెలుస్తుంది. చోట్ల ఇండిపెండెంట్లుగా బరిలోకి దిగడానికి ప్రిపేర్ అవుతున్నారని అంటున్నారు. దీంతో... ఈ వ్యవహారమేదో చినికి చినికి గాలివానగా మారే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని అంటున్నారు పరిశీలకులు. ఈ తాజా అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో రచ్చ మొదలైపోయింది. ఇందులో భాగంగా... రాయచోటి టికెట్ ను మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ప్రకటించడంతో.. ఇప్పటికే నియోజకవర్గ ఇన్ ఛార్జిగా ఉన్న రమేష్ రెడ్డి.. చంద్రబాబుపై తిరుగుబాటు జెండా ఎగరేశారు. ఈ సయంలో ఆయనకు టికెట్ ఇవ్వలేదు నియోజకవర్గంలో 11 మంది క్లాస్టర్ ఇన్ ఛార్జిలు, 286 మంది బూత్ కమిటీ సభ్యులు రాజీనామా చేసినట్లు తెలుస్తుంది. వీరితోపాటు ఆరుగురు పీఎంపీలు, 20 మంది ఐటీడీపీ సభ్యులు, మాజీ జెడ్పీటీసీలు సైతం టీడీపీకి బై బై చెప్పారని అంటున్నారు. ఇదే సమయంలో... నియోజకవర్గంలో కష్టపడిన వారిని కాదని.. వేరేవారికి టికెట్ కేటాయించారంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ.. డబ్బుల కోసం టికెట్‌ను అమ్ముకున్నారని ఆరోపిస్తూ.. ఇక్కడ టీడీపీ ఎలా గెలుస్తుందో చూస్తామంటూ రమేష్ రెడ్డి వర్గీయులు! ఇదే సమయంలో గజపతినగరం టీడీపీ కోనపల్లి శ్రీనివాస్ కి టిక్కెట్ కేటాయించడంతో ఇన్ ఛార్జ్ కొండపల్లి అప్పలనాయుడు పార్టీకి రాజీనామా చేసినట్లు సమాచారం. ఇంతకాలం పార్టీకి ఇన్ ఛార్జ్ గా ఎందుకు నియమించారు.. ఇంతకాలం సేవ చేయించుకుని ఇప్పుడు పక్కన ఎందుకు పెట్టారంటూ ఆయన వర్గీయులు ఫైరవుతున్నారు. ఇదే సమయంలో విశాఖ వెస్ట్, పెదనలోనూ పరిస్థితి తీవ్రంగా ఉందని అంటున్నారు. ఇందులో భాగంగా... విశాఖ వెస్ట్ టిక్కెట్ పీజీవీఆర్ నాయుడు (గణబాబు) కు కేటాయించడంతో పాశర్ల ప్రసాద్ టీడీపీకి గుడ్ బై చెప్పారని తెలుస్తుంది. ఇదే సమయంలో... పెదన టికెట్ ను కాగిత కృష్ణ ప్రసాద్‌కు కేటాయించారు చంద్రబాబు. దీంతో చంద్రబాబు మాట తప్పారంటూ మండిపడుతున్నారు మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్. ఈ సందర్భంగా ఇండిపెండెంట్ గా పోటీచేస్తారా అనే చర్చ తెరపైకి వచ్చింది. ఈ విధంగా స్పందించిన వేదవ్యాస్... తన కుటుంబానికి పెదన నియోజకవర్గంతో విడదీయలేని అనుబంధం ఉందని.. తన తండ్రి కానీ, తాను కానీ ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఏనాడూ 40 వేలకు ఓట్లు తగ్గలేదని తేలింది. దీంతో పరోక్షంగా ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానని స్పష్టం చేశారు పరిశీలకులు! మరి ఇంకా ఎంతమంది టీడీపీ అసంతృప్తులు రెబల్స్ గా మారతారో వేచి చూడాలి!

# అమరావతిపై ఇక దాగుడుమూతల తగవు



అమరావతి,అమరాతి విషయంలో సిఎం జగన్ తప్పటడుగులు వేశారని కోర్టులు, కేంద్రం చెప్పినా జగన్ ప్రభుత్వం మాత్రం తప్పుదిద్దుకునే ప్రయత్నాల్లో లేదు. విశాఖ రాజధాని అని చెబుతున్నవారు మూడేళ్ల క్రితమే ఆ పని చేసివున్నా ఈ పాటికి ఎపికి ఓ రాజధాని అనేది ఉండేది. విశాఖను కూడా రాజధాని చేసుకుంటే అడ్డుకునే వారు ఉండేవారు కాదు. కానీ మూడు రాజధానుల పేరుతో ఆడిన నాటకాలు ఎపి పురోభివృద్ధిని దెబ్బతీసాయి. రాజధాని అన్నది లేకుండా చేశాయి. అందుకే దానిని సరిదిద్దు కోవాలని వివిధ పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇంకా దీనిని కొనసాగించడం వల్ల లాభం లేదన్న విషయం గత నాలుగేళ్లుగా అయినా సిఎం జగన్‌కు అర్థం అయివుండాలని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మూడు రాజధానులతో ప్రజలను గందరగోళంలోకి నెట్టేశారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా రాజధాని అమరావతి నిర్మాణానికి దోహదపడి ఉంటే బాగుండేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఎన్నికల వేళ దీనిపై ప్రజలు నిలదీయాలని అన్నారు. ఈ విషయాన్ని తేలికగా తీసుకోవద్దన్నారు. రాజధాని లేని రాజ్యం లాగా ఆంధ్రప్రదేవ్ కొనసాగడం ఎంతమాత్రం సరికాదన్నారు. గత ప్రభుత్వంపై కక్షతో ఇలాంటి కీలక విషయంలో తీసుకున్న నిర్ణయాలు ప్రజల భవిష్యత్‌ను అంధకారంలో పడేశాయని అన్నారు. అమరావతి కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. అమరావతి రాజధాని కోసం కేంద్రంతో పోరాడాలని కాంగ్రెస్ నేతలు వైఎస్ షర్మిల, తులసిరెడ్డిలు కూడా డిమాండ్ చేశారు. తాము అమరావతికి కట్టుబడి ఉంటామని అన్నారు. అమరావతిని పక్కన పెట్టడంతో ఎపికి పెట్టుబడులు వెనక్కి పోయాయని టిడిపి నేతలు ధూళిపాళ్ల నరేంద్ర, ప్రత్తిపాటి పుల్లారావులు అన్నారు. రైతుల ఆందోళనతో జై అమరావతి నినాదం హోరెత్తింది.. అమరావతే తమ అంతిమ లక్ష్యం అంటూ అక్కడి రైతులు, మహిళలు, కూలీలు ఉద్యమ పిడికిలి బిగించారు. ఎన్ని అవమానాలు ఎదురైనా.. అడ్డంకులు కల్పించినా.. కేసులు పెట్టినా అడుగులు వెనకకు పడవంటూ తెగేసి చెప్పారు. రైతులు, మహిళలు దీక్ష చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని నినదించారు. ఏకైక రాజధానిగా అమరావతినే కొనసాగించాలన్న డిమాండ్‌తో ఉద్యమిస్తున్న రైతులు, మహిళలు అదే పట్టుదల కొనసాగిస్తున్నారు. ఈ ఉద్యమ లక్ష్యాన్ని గుర్తించి ప్రభుత్వం తక్షణం తన విధానాన్ని సమీక్షించుకోవాలని ఆయా పార్టీల నేతలు సూచించారు. అమరావతి రాజధాని గ్రామం వెలగపూడిలో దీక్ష కొనసాగిస్తున్నారు. అమరావతి ప్రజాదీక్ష పేరుతో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వైసీపీ మినహా అన్ని రాజకీయ పక్షాలు మద్దుతు తెలిపాయి. అలానే ప్రజా, కులసంఘాలు తమ మద్దతు తెలియజేశాయి. ప్రభుత్వం మూడురాజధానుల బిల్లుల్ని మళ్లీ తేస్తే.. తాడోపేడో తేల్చుకునేవరకూ విశ్రమించబోమని రైతులు తేల్చిచెప్పారు. అమరావతి సాధన ప్రతిజ్ఞ..పాలనా రాజధానిగా అమరావతిని ప్రకటించే వరకు తమ పోరు ఆపేది లేదని దళిత జేఏసీ నేతలు చెప్పారు. రైతులు, మహిళలు తలపెట్టిన దీక్షలకు అన్ని పార్టీలకు చెందిన మహిళా నేతలు తమ మద్దతు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పంతాలకు పోకుండా చూడాల్సి ఉంది. ఇకపోతే ప్రబుత్వం కూడా ఖచ్చింతంగా నిర్ణయం ప్రకటించాలి. రోజుకో మాట మాట్లారాదు. మంత్రులు ఒకమాట, సజ్జల ఒకమాట మాట్లాడుతూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. తాము విశ్వాఖకే కట్టుబడి ఉన్నామంటున్న వారు మిగతా విషయాలు మాట్లాడకుండా రాజధానిని తరలించే ప్రయత్నాలు చేయాలి.

# బీజేపీ కోసం వెంపర్లాడుతున్న చంద్రబాబు...



అమరావతి, భారతీయ జనతా పార్టీతో పొత్తు కోసం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు తెగ ఆరాటపడుతున్నారు. ఏపీలో అర శాతం ఓటు షేర్ మాత్రమే ఉన్న బీజేపీని ప్రసన్నం చేసేందుకు చంద్రబాబు ఎదురు చూస్తున్నారు. ఈ నెల మొదటివారంలో ఢిల్లీ వెళ్లి అమిత్ షాని కలసివచ్చిన తర్వాత ఆ పార్టీ ఏం చెప్పిందో ఏ రకమైన ప్రతిపాదనలు చేసిందో తెలియదు కానీ ఇన్నాళ్లూ ఆగి ఇపుడు ఏకంగా 118 మంది అభ్యర్థులతో కలిసి జనసేనతో కలిసి టీడీపీ ఉమ్మడి జాబితాను విడుదల చేసింది. అందులో జనసేనకు ముష్టి వేసినట్లుగా కొన్ని సీట్లు విదిలించేసింది. ఆ సీట్లు చాలు అని జనసేన అధినాయకత్వం అనిపిస్తుంది. ఇక బీజేపీ కి ఎన్ని సీట్లు ఇస్తారో అన్నది ఒక చర్చగా ఉంది. బీజేపీ జాతీయ స్థాయిలో బలమైన పార్టీ. బీజేపీ మరోసారి అధికారంలోకి రాబోతున్న గట్టి పార్టీ అందుకే అన్నట్లుగా మూడవ వంతు సీట్లనే బాబు రిజర్వ్ చేసి పెట్టారు. ఏపీలో ఉన్న మొత్తం 175లో 118 సీట్లను ప్రకటించిన బాబు 57 సీట్లను కూడా పక్కన ఉంచేశారు. అంటే ఇందులో బీజేపీ కోరిన సీట్లు ఇచ్చేందుకే అని అంటున్నారు. బీజేపీతో సీట్ల పితలాటకం ఇంకా తెగలేదు అనడానికి ఈ రిజర్వ్ చేసిన సీట్ల నంబరే సాక్ష్యం అని అంటున్నారు. ఒక వైపు బీజేపీకి ఏపీలో బలం లేకపోయినా సీట్లు ఎక్కువ ఇచ్చేందుకే చంద్రబాబు సిద్ధపడుతున్నారు. బీజేపీ అడిగితే అన్ని సీట్లు ఇస్తారా అంటే బాబు సొంతంగా నెగ్గలేమన్న భయంతోనే ఇలా చేస్తున్నారు అని అంటున్నారు. బీజేపీకి సీట్లు ఇచ్చిన తరువాతనే టీడీపీ చివరి జాబితా రిలీజ్ అవుతుంది అన్నది చూస్తే టీడీపీ దైన్యానికి ఇది ఒక నిదర్శనం అని అంటున్నారు. టీడీపీ గతంలో ఎప్పుడో ఇలా లేదని ఇపుడు సొంతంగా ఎన్నికలకు పోకూడదు అన్న ఉద్దేశ్యంతోనే ఎంతకైనా తగ్గాలని చూస్తోందని, ఫలితంగా అడుగులు పాతాళం వైపే పడుతున్నాయని అంటున్నారు. బీజేపీ ఎన్ని సీట్లు అడిగినా ఇచ్చేందుకు ఓకే అన్నట్లుగా బాబు 57 సీట్లు అలా రిజర్వ్ చేయడాన్ని చూసిన వారు టీడీపీ హిస్టరీ గత వైభోగం ఏమైంది అని ప్రశ్నిస్తున్నారు. ఏపీలో తమకు తిరుగులేదని వైసీపీ పని అయిపోయిందని బాబు చెబుతున్నారు. జనసేన టీడీపీ పొత్తు పెట్టుకున్న నాడే వైసీపీకి ఓటమి అన్నది అయిందని గంభీరంగా ఉన్నారు. మరి అంత నిబ్బరంగా ఉన్న బాబు మొత్తానికి మొత్తం లిస్ట్ ని ఎందుకు ప్రకటించలేకపోతున్నారు అన్న చర్చ జరుగుతోంది. ఏపీలో బీజేపీ పెద్ద నంబర్ అడిగితే ఇచ్చేందుకు కూడా బాబు సిద్ధమా అన్న ప్రశ్నలు కూడా వస్తున్నాయి. అలా కనుక చూస్తే అది టీడీపీ పొత్తులతోనే తన అసమర్ధతను చాటుకుంటున్నట్లు కాదా అని కూడా అడుగుతున్నారు. పైకి మేకపోతు గాంభీర్యంతో మాట్లాడుతూ గెలిచేది మేమే అని చెబుతూ ఏపీలో ఎక్కడా లేని బీజేపీ కోసం భారీ సీట్లను ఉంచడంలోనే టీడీపీ భయం ఏర్పడిందని అంటున్నారు. పొత్తులు ఎక్కడైనా ఉభయతారకంగా ఉండాలి. కానీ టీడీపీ ఈ విషయంలో అన్ని రకాలుగా తిలోదకాలు ఇస్తూ రాజకీయంగా పార్టీని పతనానికి చేరుస్తూ తావే గెలుస్తున్నట్లుగా గొప్పలు చెప్పుకోవడంపైనే అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రకటించిన జాబితా తీరు చూస్తే కనీసం 120 సీట్లలో అయినా పోటీ చేస్తుందా లేదా అన్న డౌట్లు కూడా వస్తున్నాయని అంటున్నారు. ఏది ఏమైనా రాజకీయాల్లో ఆత్మహత్యలే ఉంటాయి హత్యలు ఉండవు అనడానికి బీజేపీతో పొత్తులే నిదర్శనం అంటున్నారు. చంద్రబాబు తెలివితో చేస్తున్నారా లేదా అన్నది తొందరలోనే తెలుస్తుంది అని కూడా అంటున్నారు.

# వచ్చే పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ తిరుగులేని శక్తిగా భారత్



న్యూఢిల్లీ,ఆర్థిక మాంద్యం సమయంలో సైతం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలోని ఏకైక దేశం భారతదేశం అని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పునర్ఘాటించారు. పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్, శ్రీలంక ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఆయన గుర్తు చేశారు. బ్రిటన్, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలదీ అదే పరిస్థితి. అక్కడ కూడా వృద్ధి రేటు నత్త నడకన సాగుతోంది. వచ్చే పదేళ్లలో భారత్ ఆరు నుంచి ఎనిమిది శాతం వృద్ధి రేటుతో అభివృద్ధి చెందిన దేశంగా అవరించబోతుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. వచ్చే 10 ఏళ్లలో భారత్ సాక్ష్యమివ్వనున్న అద్భుతమైన వృద్ధికి అనుగుణంగా వ్యాపార, వ్యూహాత్మక ప్రణాళికలను రూపొందించుకోవాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు కేంద్ర ఐటీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్. ముంబయిలో జరిగిన '%జ్% ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ 2023' కార్యక్రమంలో మంత్రి ప్రసంగిస్తూ, రైసినా డైలాగ్ 2024లో భారతదేశంలో వ్యాపారం చేయవలసిందిగా గ్లోబల్ కంపెనీలను ఆయన ఆహ్వానించారు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల నుండి లబ్ది పొందేందుకు ప్రభుత్వం వారికి అన్ని విధాలా సహాయాన్ని అందజేస్తుందని స్పష్టం చేశారు. భారతదేశాన్ని ప్రపంచానికి బహిరంగ మార్కెట్‌గా అభివర్ణించిన ఆయన ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగంగా సాగుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల వల్ల భారత దేశం వేగంగా ప్రగతి పథంలో దూసుకుపోతోందని ఆయన అన్నారు. భవిష్యత్తులో 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి పునాది వేయడం జరిగిందన్నారు. రాబోయే ఐదేళ్లలో విద్య, ఆరోగ్యం, సేవ, తయారీ, సాంకేతిక రంగాల అభివృద్ధిపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 2027 నాటికి భారతదేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని కేంద్ర మంత్రి అశ్విని అంచనా వేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెరిగాయన్నారు. గత 9 ఏళ్లలో ఇది 615.73 బిలియన్ డాలర్లకు చేరుకుందని వెల్లడించారు. భారత విదేశీ మారకద్రవ్య నిల్వలు కూడా వేగంగా పెరిగాయన్నారు. ప్రస్తుతం 620.44 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంది. మొత్తంమీద భారతదేశం గ్లోబల్ ఇంజిన్‌కు హబ్‌గా మారే రోజు దగ్గరలోనే ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా భారత్‌పై అంతర్జాతీయ విశ్వాసం అత్యున్నత స్థాయిలో ఉందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ వృద్ధి అంచనా 7 శాతంగా ఉందన్నారు. కానీ వాస్తవానికి, %చీూ% (నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్) ప్రస్తుత సంవత్సరానికి 7.3% చేరుకుందని, అదీ 2024-

# రాజ్యసభ అభ్యర్థులపై క్రిమినల్ కేసులు..!

## సగటు ఆస్తి విలువ రూ.127.81కోట్లు.. ఏడీఆర్ రిపోర్ట్‌లో వెల్లడి..!




న్యూఢిల్లీ, రాజ్యసభకు అభ్యర్థుల్లో 36 శాతం మందిపై క్రిమినల్ కేసులో నమోదయ్యాయి. ఈ విషయం ఓ నివేదిక. 15 రాష్ట్రాలకు చెందిన 58 మంది అభ్యర్థుల అఫిడవిట్‌లను విడుదల చేసిన అనంతరం.. అభ్యర్థుల ఆగస్టు ఆస్తుల విలువ రూ.127.81కోట్లుగా ఉందని ఏడీఆర్ సంస్థ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ నివేదిక ప్రకారం.. 59 మంది అభ్యర్థులు రాజ్యసభ ఎన్నికల రేసులో ఉన్నారు. అయితే, కర్ణాటక కాంగ్రెస్ అభ్యర్థి జీసీ చంద్రశేఖర్ అఫిడవిట్‌ను మాత్రం గుర్తించలేకపోయారు. స్కాన్ చేసిన పత్రాలు చదవడం సాధ్యం కాలేదు.. దాంతో 58 మంది అభ్యర్థుల అఫిడవిట్‌లను మాత్రమే పరిశీలించినట్లు నివేదించారు ఇందులో 36 శాతం మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇందులో 17 శాతం మంది తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. ఓ అభ్యర్థిపై హత్యాయత్నం ఆరోపణలున్నాయి. ఏడీఆర్ నివేదిక ప్రకారం.. 30 మంది బీజేపీ అభ్యర్థుల్లో 8 మంది, తొమ్మిది మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో ఆరుగురు, పశ్చిమ బెంగాల్‌లోని అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ నుంచి నలుగురిలో ఒకరిపై, ఇద్దరు సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులను గుర్తించారు. ఏపీలో వైఎస్సార్సీపీ నుంచి ముగ్గురిలో ఒకరు, ఆర్జేడీకి చెందిన ముగ్గురిలో ఒకరు, ఒడిశాలోని అధికార బీజేడీ నుంచి ఒక అభ్యర్థి కేసు క్రిమినల్ కేసులున్నాయి. వీరంతా అఫిడవిట్లలో క్రిమినల్ కేసులున్నట్లుగా అంగీకరించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ఆర్థిక పరిస్థితిని కూడా అంచనా వేసింది. దాదాపు 21 శాతం మంది అభ్యర్థులు బిలియనర్లీ కాగా.. రూ.100కోట్లకుపైగా ఆస్తులున్నాయి. రాజ్యసభ అభ్యర్థుల సగటు ఆస్తులు రూ.127.81 కోట్లుగా ఏడీఆర్ ప్రదర్శించారు.

## త్వరగా యాదాద్రి పనుల పూర్తి..అధికారులకు భట్టి ఆదేశాలు

నల్లగొండ, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర మంత్రుల బృందం పవర్‌ప్లాంట్‌ను సందర్శించింది. బేగం పేట నుంచి హెలికాప్టర్లో విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్, ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వీర్లపాలెం వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు చేరుకున్నారు. వీరికి సీఎండీ రిజ్వీ, కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందన దీప్తి స్వాగతం పలికారు. ముందుగా ఎ÷–లాంట్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఎండీ గెస్ట్ హౌస్‌లో ఉన్నతధికారులతో ప్రాజెక్టు పనులపై రివ్యూ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ప్రాజెక్టు పనులకు సంబంధించి నిర్లక్ష్యం, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# ఆర్వో ఆర్ చట్టంలోనే లోపాలున్నాయి



హైదరాబాద్,ధరణి పోర్టల్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మార్చి మొదటి వారంలోనే అన్ని మండల తహసీల్దార్ ఆఫీసుల్లో వీటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. ధరణి కమిటీ చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకొని, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన విధి విధానాలను రూపొందించాలని రెవిన్యూ శాఖను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ధరణిలో 2.45 లక్షల పెండింగ్ కేసులున్నాయి. మొదటి విడతగా వీటిని వెంటనే పరిష్కరించేందుకు ఏమేం మార్గాలున్నాయని ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే వీటిని పరిష్కరించేందుకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని, మార్చి మొదటి వారంలోనే అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులకు సూచించారు. శనివారం సచివాలయంలో ధరణి కమిటీతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ధరణి కమిటీ సభ్యులు ఎం. కోదండరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ రేమండ్ పీటర్, అడ్వకేట్ సునీల్, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ బి.మధుసూదన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శేషాద్రి, సీసీఎల్ఏ అధికారి లచ్చిరెడ్డి, ఉన్నతాధికారులు సమావేశంలో ఉన్నారు. 2020లో అమల్లోకి వచ్చిన ఆర్వో ఆర్ చట్టంలోనే లోపాలున్నాయని ధరణి కమిటీ ముఖ్యమంత్రికి నివేదించింది. అప్పుడు కేవలం మూడు నెలల్లో హడావుడిగా చేపట్టిన భూ సమగ్ర సర్వేతోనే కొత్త చిక్కులు వచ్చాయని చెప్పారు. ఆ రికార్డులనే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోవటంతో భూముల సమస్యలు, భూముల రికార్డుల వివాదాలు ఎక్కువయ్యాయని అన్నారు. దీంతో లక్షలాది సమస్యలు ఉత్పన్నమయ్యాయని, కనీసం పేర్లలో చిన్న అక్షర దోషాలున్నా సరిదిద్దుకునేందుకు జిల్లా కలెక్టర్ దాకా వెళ్లాల్సి వస్తుందని వివరించారు. దాదాపు 35 మాడ్యుల్స్ ద్వారా ధరణి డేటాలో ఉన్న తప్పులను సవరించుకునేందుకు రెవిన్యూ శాఖ అవకాశం ఇచ్చిందని, కానీ ఏ మాడ్యుల్లో దేనికి దరఖాస్తు చేసుకోవాలనే అవగాహన లేకపోవటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని కమిటీ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. లక్షలాది దరఖాస్తులు ఇప్పటికే తిరస్కరణకు గురయ్యాయని, ఒక్కో తప్పును సవరించుకోవాలంటే వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించాల్సి ఉండటం రైతులకు భారంగా మారిందని తెలిపారు. అటు రిజిస్ట్రేషన్ల శాఖ, ఇటు రెవిన్యూ శాఖల మధ్య సమన్వయం లోపంతో నిషేధిత జాబితాలో ఉన్న భూముల క్రయ విక్రయాలు కూడా జరుగుతున్నాయని చర్చ జరిగింది. ధరణి డేటాను వ్యవసాయ శాఖ ప్రామాణికంగా తీసుకొని రైతు బంధు ఖాతాలో జమ చేయటంతో ఇప్పటికే కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందని చర్చ జరిగింది. ఇప్పుడున్న ధరణి లోపాలను సవరించాలంటే చట్ట సవరణ చేయటం లేదా కొత్త ఆర్ వో ఆర్ చట్టం చేయటం తప్ప గత్యంతరం లేదని కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి నివేదించారు. కమిటీ ఇచ్చే తుది నివేదిక ఆధారంగా శాశ్వత పరిష్కారానికి నిర్ణయం తీసుకుందామని సీఎం చెప్పారు. సమస్యలను మరింత లోతుగా అధ్యయనం చేయాలని, ఎలాంటి భూవివాదాలు, కొత్త చిక్కులు లేకుండా భూముల రికార్డుల ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరముందని సీఎం అన్నారు. భూముల రికార్డులపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతో ఇప్పుడున్న లోపాలకు చెక్ పెట్టడంతో పాటు కొత్త సమస్యలు రాకుండా ఉండాలని సీఎం కమిటీ సభ్యులను అప్రమత్తం చేశారు. కమిటీ ఇచ్చే తుది నివేదిక ఆధారంగా శాశ్వత పరిష్కారానికి నిర్ణయం తీసుకుందామని చెప్పారు. అప్పటివరకు తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలపై దృష్టి పెట్టాలని సీఎం అన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com